

టీజీ రెడ్కో, వైస్‌చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం వావిళ్ల అనిల శుక్రవారం టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీని మర్యాద పూర్వకంగా కలిశారు

● హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



ఎమ్మెల్యే సమక్షంలో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న బాల్‌రెడ్డి తదితరులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తలసాని

సనత్‌నగర్ ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీజన్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన స్వగృహంలో నలుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చిన్నారులకు టీకాలు వేయించడంతోపాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, కొలను బాల్‌రెడ్డి, కూర్మ హేమలత, హరిసింగ్ జాదవ్, గోపీలాల్ చౌహాన్, వెంకటేష్ పాల్గొన్నారు.

హెరిటేజ్ టవర్ కోసం రూ.25 లక్షల విరాళం

బంజారాహిల్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న హెరిటేజ్ టవర్ కోసం నర్సింగ్ క్లాత్ ఎంపోరియం రూ.25 లక్షల విరాళం ప్రకటించింది. బంజారాహిల్స్‌లోని స్వయంభు లక్ష్మీనర్సింహ(స్వర్ణ) ఆలయంలో సంస్థ ఎండీ సంజయ్ సింఘానియా చెక్కును హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాసకు అందజేశారు. ఈ సందర్భంగా సత్యగౌరచంద్ర దాస మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా టవర్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణకు మైలు రాయిగా మిగిలిపోతుందని చెప్పారు.



సత్యగౌర చంద్రదాసకు చెక్కును అందజేస్తున్న సంజయ్ సింఘానియా

కవితపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

● సైబర్‌క్రైం పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్సీ కవితపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అధికార కాంగ్రెస్‌కు చెందిన సోషల్ మీడియా విభాగాలతోపాటు ఆ పార్టీ నాయకుల సోషల్ మీడియా ఖాతాల్లో అసభ్యకర పోస్టింగ్‌లు చేస్తున్నారని అందులో పేర్కొన్నారు.



రోడ్డుపై చెత్త వేసిన మహిళలకు జరిమానా విధిస్తున్న డీసీ సమ్మయ్య

ఇళ్లలోని చెత్తను ఆటో రిక్షాలోనే వేయాలి : డీసీ

బేగంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చెత్తను రోడ్లపై వేయకుండా ఆటో రిక్షాలోనే వేయాలని బేగంపేట సర్కిల్ డీసీ సమ్మయ్య సూచించారు. శుక్రవారం బేగంపేట డివిజన్ ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. రోడ్డుపై చెత్త వేస్తున్న మహిళకు రూ.100 జరిమానా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డీఈ ధర్మారెడ్డి, దయాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జకీరా సుల్తానాకు శుభాకాంక్షలు చెబుతున్న కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి

సర్కిల్-19 డీఎంసీగా జకీరా సుల్తానా

యూసుఫ్‌గూడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ సర్కిల్-19 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న జకీరా సుల్తానా శుక్రవారం సర్కిల్ పరిధిలో పర్యటించారు. వెంగళరావునగర్ డివిజన్‌లోని నీటి కొలనులలో దోమలు వృద్ధి చెందకుండా గంబూసియా చేపలను వదలడంతో పాటు ఆయిల్ బాల్స్‌ను వదిలారు. బస్తీ దవాఖానాలను సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఆమె వెంట ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు ప్రసూన, సతీష్, సాయిబాబా తదితరులు

ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం

బేగంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో నటసింహం నందమూరి బాలకృష్ణ సినీ ప్రస్థానం 50 వసంతాల వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రసూల్‌పురలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు కాట్రగడ్డ ప్రసూన, సాయిబాబా, శ్రీపతి సతీష్ తదితరులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సోమలింగం, బత్తిని హరిగౌడ్, బోప్పన ప్రవీణ్, రవిచంద్ర, తిరుపతినాయుడు, మహేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగి ఆత్మహత్య

ఎర్రగడ్డ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రిలో మానసిక రోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లిని హత్య చేసిన కేసులో ప్రశాంత్(23) చర్లపల్లి జైలులో ఉంటున్నాడు. మానసిక స్థితి సరిగా లేదని జైలు సిబ్బంది నెల రోజుల కిందట ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స అనంతరం డిశ్చార్జి చేయగా జైలుకు తీసుకెళ్లారు. తిరిగి ఈ నెల 22న ఆస్పత్రికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం బాత్‌రూమ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని బోరబండ పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వెంగళరావునగర్ ప్రభుత్వ పాఠశాల వీధిలో చెట్లకొమ్మలు



సీ-బ్లాక్‌లో రహదారిని ఆక్రమించిన చెట్లకొమ్మలు

నరికిన చెట్లకొమ్మలను తొలగించేదెప్పుడు?

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

వెంగళరావునగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీలోని పలు బ్లాక్‌లలో విద్యుత్ తీగలకు చెట్లకొమ్మలు అడ్డు ఉన్నాయని నాలుగు రోజుల క్రితం సిబ్బంది కట్ చేశారు. వాటిని రహదారి పక్కన, ఫుట్‌పాత్‌పైన పడేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆకులు ఎండిపోయి గాలి దుమారానికి రాకపోకలు సాగించే వారి కళ్లలో పడుతున్నాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చెట్లకొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

పరిశోధనలతోనే విద్యార్థులకు విజ్ఞానం

● ఇస్రో అసిస్టెంట్ డైరెక్టర్, సైంటిస్ట్ శేషగిరిరావు

బంజారాహిల్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పరిశోధనా విద్యవైపు విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు మరింత విజ్ఞానవంతులు అవుతారని ఇస్రో అసిస్టెంట్ డైరెక్టర్, సైంటిస్ట్ వి.శేషగిరిరావు అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్డు నం.7లోని మెరీడియన్ స్కూల్‌లో మోడల్ ఐక్యరాజ్య సమితి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభోపన్యాసం చేశారు. విద్యార్థులు కెరీర్ ఆధారిత వృత్తులపై కాకుండా పరిశోధన ఆధారిత అధ్యయనంపై కృషి చేయాలని సూచించారు. ఎంచుకున్న సబ్జెక్ట్‌పై పట్టు సాధించేందుకు విద్యార్థులు పరిశోధన చేయాలని సూచించారు. మెరీడియన్ స్కూల్ 9వ ఎడిషన్ ఎంయూఎన్‌లో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించే ఈ మోడల్ ఐక్యరాజ్య సమితి కార్యక్రమంలో 300 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని, వారు ప్రపంచంలోని పలు దేశాల ప్రతినిధులుగా వ్యవహరిస్తూ ఆయా దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలు, పరిష్కారాలపై చర్చించి తీర్మానాలు ప్రవేశపెడతారని తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల ప్రెసిడెంట్ లలితానాయుడు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నిషిరాణా, రాజాస్ అగర్వాల్, శాండిల్య దేవరశెట్టి పాల్గొన్నారు.



మోడల్ ఐక్యరాజ్య సమితిని ప్రారంభిస్తున్న శేషగిరిరావు

పర్యావరణ అనుకూలంగా ఫ్యాషన్ ఉండాలి

● వై ఫ్లో సదస్సులో వక్తలు



సస్టైయినబుల్ ఫ్యాషన్‌పై రౌండ్‌టేబుల్ చర్చలో వక్తలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్‌పరంగా నూతనంగా ఏది సృష్టించినా అది పర్యావరణంపై ప్రభావం చూపుతుందని బెహ్నో న్యూయార్క్ ఫౌండర్ శివమ్ పుంజ్యా అన్నారు. తన దృష్టిలో సస్టైయినబల్ ఫ్యాషన్ అంటే నిజాయితీగా ఉండడమేనన్నారు. శుక్రవారం మాదాపూర్‌లో యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(వై ఫ్లో) ఆధ్వర్యంలో సస్టైయినబుల్ ఫ్యాషన్‌పై రౌండ్‌టేబుల్ చర్చ జరిగింది. వ్యాపారవేత్త పింకీరెడ్డి, ఫ్యాషన్ డిజైనర్ గౌరంగ్ షా, కాన్సియస్ ఎఫర్ట్ ఫౌండర్ సాచిబాల్ పాల్గొన్నారు. ప్రపంచమంతా ఇప్పుడు ఫ్యాషన్ వైపు చూస్తోందని గౌరంగ్ షా అన్నారు. ఇక్కడ లభించినంత చేనేత వస్త్ర వైవిధ్యం మరెక్కడా లభించదని పేర్కొన్నారు. వై ఫ్లో చైర్‌పర్సన్ రిద్ధి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కేవలం ఒకశాతం వస్త్రాలు మాత్రమే రీ సైకిల్ చేస్తుండడం ఆందోళనకరమన్నారు.

మెట్రో ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలి

బేగంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైల్ ప్రయాణికుల నుంచి పార్కింగ్ చార్జీల వసూలును మెట్రో, ఎల్‌అండ్‌టీ సంస్థలు తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బేగంపేటలోని మెట్రో రైలు కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్‌రెడ్డిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే నాగోల్, మియాపూర్‌తో పాటు అన్ని మెట్రోస్టేషన్లలో ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న యువజన నేతలు

హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు పౌష్టికాహారం

పంజాగుట్ట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉమెన్స్ చిల్డ్రన్స్ బెస్ట్ ఆర్గనైజేషన్(డబ్ల్యూసీబీఓ) సంస్థ సంరక్షణలోని హెచ్‌ఐవీ పిల్లలకు శుక్రవారం రూ.1.50 లక్షల విలువ చేసే పౌష్టికాహారం అందజేసినట్లు భారత్ కిసాన్ ఫౌండేషన్ చైర్మన్ కుమారస్వామి తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు భరత్, కమ్మర చంద్రమౌళి, కె.నరసింహరాజు, కె.యాదగిరి, సభ్యులు కె.సౌమ్య, ఠాకూర్ దివ్య, డబ్ల్యూసీబీఓ డైరెక్టర్ లక్ష్మీప్రియ, చైర్మన్ స్వరూప పాల్గొన్నారు.



లక్ష కుంకుమార్చనలో మహిళలు

ఘనంగా లక్ష కుంకుమార్చన

ఎర్రగడ్డ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని విజయలక్ష్మీ ఆలయంలో శుక్రవారం లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ శ్రావణమాస విశేష మహోత్సవాలను ఆలయంలో నెల రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎంపీ రెడ్డి, మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భవానీ శంకరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

వెంగళరావునగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జీటీఎస్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానం ఆవరణలోని శ్రీ భవానీ శంకరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాజశ్యామల, వారాహి హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం అఘోర పాశుపత హోమం, ఆదివారం సరస్వతీ, దక్షిణామూర్తి హోమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు దేవేందర్‌శర్మ, లక్ష్మీనారాయణమూర్తి తెలిపారు. జీటీఎస్ ఆలయం ఆవరణలోని అయ్యప్పస్వామి ఆలయ మహా కుంభాభిషేకం వేడుకలు శుక్రవారం సాయంత్రం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ఖైరతాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాలక్ష్మి అమ్మవారికి హారతి ఇస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి, మహిళలు

● ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

జల్సాల కోసం చోరీలు

● ముగ్గురి అరెస్ట్.. తొమ్మిది ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

అమీర్‌పేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న వ్యక్తితోపాటు వాటిని కొనుగోలు చేస్తున్న ఇద్దరిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటరమణ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా, బెస్తవారిపేట మండలం, పాతమల్లాపురం గ్రామానికి చెందిన బండ్లమూడి చిన్న అవులయ్య(30) ఎర్రగడ్డలో నివసిస్తూ మెట్రో స్టేషన్‌లో సెక్యూరిటీగార్డుగా పనిచేసేవాడు. కొవిడ్ సమయంలో స్వగ్రామానికి వెళ్లిపోయాడు. తిరిగి 2023లో నగరానికి వచ్చి గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో కొంతకాలం సెక్యూరిటీగార్డుగా పనిచేశాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో చోరీల బాట పట్టాడు. ఎస్ఆర్‌నగర్, బాపూనగర్ పరిసర ప్రాంతాల్లో హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌లు దొంగిలించాడు. వీటిని నేరేడ్‌మెట్‌లో సెల్‌ఫోన్ మరమ్మతుల షాపు నిర్వహిస్తున్న ప్రకాశం జిల్లా బెస్తవారిపేటకు చెందిన వెంకట కృష్ణ(33), అంబర్‌పేటలో ఉంటున్న బెస్తవారిపేటకు చెందిన మేకల వెంకటేశ్వర్లు(30)కు విక్రయించేవాడు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు అమీర్‌పేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అవులయ్య, వెంకట కృష్ణ, వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2.13 లక్షల విలువైన 9 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గోపాత్, ఎస్ఐ రాజురాథోడ్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ

ఆటోలో ఎక్కించుకుంటారు.. ఫోన్ కొట్టేస్తారు

● ఒకే రోజు ముగ్గురి సెల్‌ఫోన్లు చోరీ

యూసుఫ్‌గూడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే రోజు ఒకే తరహాలో ఆటోలో ముగ్గురి సెల్‌ఫోన్‌లు చోరీ అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ రెహ్మత్‌నగర్ సంతోష్‌గిరిలో నివాసం ఉంటూ వాల్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం పని కోసం బ్రహ్మశంకర్‌నగర్ నుంచి యూసుఫ్‌గూడ బస్తీ వెళ్లేందుకు వచ్చాడు. అతడి ముందు ఓ ఆటో ఆగింది. వెనక సీట్లో ముగ్గురు కూర్చుని ఉన్నారు. డ్రైవర్ పక్కన కూర్చునేందుకు అజయ్ ప్రయత్నించాడు. డ్రైవర్ ముందు టైర్‌లో గాలి తక్కువగా ఉంది వెనక కూర్చోమని చెప్పాడు. సరేనని వెనక సీట్లోకి వెళ్లాడు. కూర్చునేందుకు ఇబ్బందిగా ఉండడంతో కార్మికనగర్‌లో దిగాడు. సెల్‌ఫోన్ చూసుకోగా కనిపించలేదు. అలాగే, రెహ్మత్‌నగర్‌లో ఉండే సాయికిరణ్ యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్దకు వెళ్లేందుకు ఆటో కోసం చూస్తుండగా ఓ ఆటో ఆగింది. వెనక సీట్లో ముగ్గురు ఉన్నారు. వెనక కూర్చోవడం ఇబ్బందిగా ఉందని ఆటో దిగాడు. సెల్‌ఫోన్ చూసుకోగా కనిపించలేదు. రెహ్మత్‌నగర్‌లో ఉండే కోటి సత్యం మైత్రివనం వెళ్లేందుకు హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం వద్ద ఆటో ఎక్కాడు. వెనక సీట్లో ముగ్గురు ఉన్నారు. కొంతదూరం వెళ్లాక వెనక కూర్చోవడం ఇబ్బందిగా ఉందని ఆటో దిగాడు. సెల్‌ఫోన్ చూసుకోగా కనిపించలేదు. ఈ మూడు సంఘటనలు గురువారం ఉదయం 8.40 గంటల నుంచి 9 గంటలలోపు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఎస్పీఆర్‌హిల్స్ నుంచి ఆటోలో వచ్చిన వారు సెల్‌ఫోన్‌లు చోరీ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



వస్త్ర ప్రదర్శనలో ఉత్పత్తులను తిలకిస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న సిల్క్ ఆఫ్ ఇండియా వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అన్ని ఉత్పత్తులను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ బెంగాల్ ఆర్ట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్డునంబర్.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సిల్క్ ఆఫ్ ఇండియా వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటోంది. సందర్శకులతో స్టాళ్లు కళకళలాడుతున్నాయి. జాతీయ అవార్డు పొందిన ప్రత్యేక చీరలు అందుబాటులో ఉన్నాయి. చేనేతకారులు రూపొందించిన ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇక్కడ 100 శాతం ప్యూర్ ఆథెంటిక్ చేనేత ఉత్పత్తులకు సంబంధించి 35కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. సుమారు 20 రాష్ట్రాల నుంచి చేనేత కార్మికులు వచ్చి బెనారస్, బగల్పురి, బెంగళూరు సిల్క్, మైసూర్ సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, లెనిన్ కాటన్ వంటి మరెన్నో మెటీరియల్స్ అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శన సెప్టెంబర్ 4 వరకు కొనసాగుతుందని నిర్వాహకుడు సోమనాథ్ తెలిపారు.



విద్యార్థి రాఖీపాల్‌కు అవార్డు అందజేస్తున్న డీఈఓ రోహిణి

ప్రతిభ కనబరిచే విద్యార్థులకు అవార్డులు

అమీర్‌పేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, సెకండరీ స్థాయి విద్యలో ప్రతిభకనబరిచే విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు అవార్డులు అందజేయనున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి తెలిపారు. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన శ్రీనిధి గౌతమి విద్యాలయం విద్యార్థి రాఖీపాల్ పదోతరగతిలో 10/10 జీపీఏ సాధించారు. ఇటీవల రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాఖీ పాల్‌కు రోహిణి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో సైబర్ క్రైం డీఎస్పీ ఎస్‌బీ రత్నం, ట్రస్మా ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్‌రావు, పాఠశాల డైరెక్టర్లు కె.లక్ష్మణ్‌రావు, సుకుమార్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన బ్రహ్మం టాలెంట్ స్కూల్ విద్యార్థులు

రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపిక

పంజాగుట్ట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీలోని బ్రహ్మం టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల స్వామి వివేకానంద స్కూల్ ఆఫ్ యోగా అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్-2024 జిల్లాస్థాయి యోగా పోటీలు జరిగాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వెంగళరావునగర్‌లోని బ్రహ్మం టాలెంట్ స్కూల్‌కు చెందిన 10 నుంచి 12 సంవత్సరాల విద్యార్థులలో జియాగాంధీ బంగారు పతకం, నోహిత కాంస్య పతకం, అక్షిత రజత పతకం, 14నుంచి 16 సంవత్సరాల విద్యార్థుల్లో జిసునయన రజత పతకం సాధించి రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపికయ్యారు. వీరిని శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ రాజగోపాల్‌నాయుడు, ప్రిన్సిపాల్ లిల్లీ ఎలిజబెత్, ఉపాధ్యాయులు అభినందించారు.

పేదలకు ఇబ్బంది లేకుండా 'హైడ్రా' చర్యలు చేపట్టాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చెరువులు, కుంటల ఆక్రమణలను తొలగించేందుకు ఏర్పాటు చేసిన 'హైడ్రా' పేద, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(ఎస్‌యూసీఐ) తెలంగాణ రాష్ట్రకార్యదర్శి సి.హెచ్.మురహరి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ నిజమైన భూకబ్జాదారులపైనా, ఆక్రమణలకు అనుమతులిచ్చిన అవినీతి అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'హైడ్రా'కు, ప్రభుత్వానికి గంగపుత్రుల మద్దతు

ఖైరతాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు తెలంగాణ గంగపుత్రుల పూర్తి మద్దతు ఉంటుందని తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ పేర్కొంది. శుక్రవారం ఖైరతాబాద్‌లో కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు, ప్రతినిధులు మాట్లాడారు. చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ కబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా'కు అభినందనలు తెలిపారు. నగరంలోని హుస్సేన్‌సాగర్ సైతం కబ్జాలకు గురై కుచించుకుపోయిందని ఆరోపించారు.



రేసింగ్‌లో పాల్గొనే డ్రైవర్లు

రేసింగ్ ఫెస్టివల్‌లో హైదరాబాద్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో భాగంగా శనివారం నుంచి చెన్నైలో జరగనున్న నైట్ రేసింగ్ సర్క్యూట్‌కు హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ జట్టు సన్నద్ధమైంది. మొత్తం 3.5 కి.మీ ఈ రేసింగ్ సర్క్యూట్‌లో హైదరాబాద్ జట్టు ఫార్ములా-4 కార్లు పోటీ పడనున్నాయి. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ రేసింగ్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రేసింగ్ నిర్వాహక చైర్మన్ అఖిలేష్‌రెడ్డి తెలిపారు.

ఐదు వికెట్లు తీసిన ఆదిత్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిర్వహిస్తున్న 2డే డివిజన్ లీగ్‌లో గ్రీన్ టర్ఫ్ లెగ్ స్పిన్నర్ నాళ్ల ఆదిత్య కృష్ణ ఐదు వికెట్లు తీసి సత్తా చాటాడు. నగరంలోని లహరి క్రికెట్ మైదానంలో ఆదిలాబాద్ జట్టుతో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గ్రీన్ టర్ఫ్ టీమ్ 58 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో ఆదిత్య 24 పరుగులే ఇచ్చి ఐదు కీలక వికెట్లు పడగొట్టడంతో ఆదిలాబాద్ జట్టు 47.4 ఓవర్లలో 122 పరుగులకు ఆలౌటై, పరాజయం పాలైంది.



ఆదిత్య కృష్ణ

మానసిక శిక్షణ కీలకం : అభినవ్ బింద్రా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): అథ్లెట్ల మానసిక ఆరోగ్యం వారి కెరీర్‌లో చాలా కీలక పాత్ర పోషిస్తుందని బీజింగ్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా అభిప్రాయపడ్డాడు. అథ్లెట్ మైండ్ పెర్ఫామెన్స్ (ఏఎంపీ) అనే కొత్త కార్యక్రమాన్ని ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్టు ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభినవ్ మాట్లాడుతూ ఏఎంపీ అనేది అథ్లెట్ల మానసిక స్థితిని దృఢంగా మలిచి, వాళ్లను విజేతగా నిలిపేందుకు దోహదం చేస్తుందని చెప్పాడు. ఈ ఏఎంపీ ప్రోగ్రామ్ ద్వారా అథ్లెట్ల మానసిక స్థితిని అంచనా వేసి, వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారని తెలిపాడు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య తదితరులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- డీసీపీ బాలస్వామి

బౌద్ధనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని ఈస్ట్‌జోన్ డీసీపీ బి.బాలస్వామి రౌడీషీటర్లను హెచ్చరించారు. రానున్న గణేశ్ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం బౌద్ధనగర్‌లో చిలకలగూడ డివిజన్ ఏసీపీ కార్యాలయం వద్ద ఈస్ట్‌జోన్ పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ బాలస్వామి రౌడీషీటర్లను ఉద్దేశించి మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌడీషీటర్లు ఎటువంటి అలర్లకు పాల్పడినా వారిని వదిలిపెట్టమన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎం.నర్సయ్య, ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సైదులు (వారాసిగూడ), అనుదీప్ (చిలకలగూడ), అడ్మిన్ ఎస్సైలు సుధాకర్, బాలరాజు పాల్గొన్నారు.

రైలు ఎక్కిన మహిళ అదృశ్యం


లీలాదేవి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అన్నకు రాఖీ కట్టేందుకు వచ్చిన ఓ మహిళ సికింద్రాబాద్‌లో అదృశ్యమైంది. సికింద్రాబాద్ రైల్వే సబ్ ఇన్‌స్పెక్టర్ మాజీద్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన లీలాదేవి(35) అన్న హైదరాబాద్‌లోని మారుతినగర్, చింతల్‌లో ఉంటున్నాడు. అన్నకు రాఖీ కట్టేందుకు ఈనెల 27న హైదరాబాద్‌కు వచ్చింది. తిరిగి అన్నకు రాఖీ కట్టి తిరిగి అదే రోజు రాజస్థాన్‌కు వెళ్లడానికి సోదరుడు దేవందర్ చౌదరి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దింపి రైలు ఎక్కించాడు. మరుసటి రోజు సోదరి లీలాదేవి రాజస్థాన్ ఇంటికి చేరుకోకపోవడంతో అన్న చౌదరి ఈనెల 30న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చెల్లి లీలాదేవిపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు దర్యాప్తు ప్రారంభిస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ప్రయాణికుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 8లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని 40ఏళ్ల ప్రయాణికుడు పడుకుని ఉన్నాడు. రైల్వే పోలీసులు 108కు కాల్ చేయగా అప్పటికే అతడు మృతిచెందినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకి తెలిస్తే సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తికి జైలుశిక్ష


దుర్గేష్

బౌద్ధనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్ ఫ్రైడే మార్కెట్‌లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోన్న వ్యక్తికి ఏడు రోజుల జైలుశిక్ష పడింది. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, అడ్మిన్ ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండికి చెందిన పీవీ దుర్గేష్(38) పూల వ్యాపారి. బుధవారం ఫ్రైడే మార్కెట్ వద్ద దుర్గేష్ ప్రజలను ఇబ్బందులకు గురిచేశాడు. అతడిపై ఓ మహిళ చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని శుక్రవారం సికింద్రాబాద్‌లోని 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కె.రవి శంకర్ ముందు హాజరుపర్చారు. ఏడు రోజుల శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తిరుమలగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సదర్‌బజార్‌కు చెందిన పాకాల అనసూయ, పాకాల నర్సింలు భార్యాభర్తలు. వీరికి కుమారుడు పాకాల యశ్వంత్(17) ఉన్నాడు. బొల్లారంలోని మహేష్ యాదవ్ అనే పాల వ్యాపారి వద్ద పనిచేస్తుంటాడు. మంగళవారం పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన యశ్వంత్ తల్లిని భోజనం పెట్టాలని కోరాడు. కుమారుడికి భోజనం పెట్టిన అనసూయ డౌటన్ బజార్‌లోని బంధువుల వద్దకు వెళ్లి వస్తానని యశ్వంత్‌కు చెప్పి వెళ్లింది. కొన్ని గంటల తరవాత అనసూయ ఇంటికి రాగా తలుపు గడియవేసి ఉంది. తలుపులు కొట్టగా స్పందించలేదు. అంతలో పాల వ్యాపారి మహేష్ వచ్చి యశ్వంత్ పనికి ఇంకారాలేదని చెప్పడంతో కిటికీలోంచి చూడగా యశ్వంత్ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. యశ్వంత్ ఛాతి, చేతి మీద ఓ అమ్మాయి పేరు పచ్చబొట్టు ఉందని పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టమ్ అనంతరం శుక్రవారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఎస్సై జ్యోతి కేసును పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ

జల్సాల కోసం చోరీలు

- ముగ్గురి అరెస్ట్.. 9 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

అమీర్‌పేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న వ్యక్తితోపాటు వాటిని కొనుగోలు చేస్తున్న ఇద్దరిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటరమణ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా, బెస్తవారిపేట మండలం, పాతమల్లాపురం గ్రామానికి చెందిన బండ్లమూడి చిన్న అవులయ్య (30) ఎర్రగడ్డలో నివసిస్తూ మెట్రోస్టేషన్‌లో సెక్యూరిటీగార్డుగా పనిచేసేవాడు. కొవిడ్ సమయంలో స్వగ్రామానికి వెళ్లిపోయాడు. తిరిగి 2023లో నగరానికి వచ్చి గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో కొంతకాలం సెక్యూరిటీగార్డుగా పనిచేశాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో చోరీల బాట పట్టాడు. ఎస్‌ఆర్‌నగర్, బాహునగర్ పరిసర ప్రాంతాల్లో హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌లు దొంగిలించాడు. వీటిని నేరేడ్‌మెట్‌లో సెల్‌ఫోన్ మరమ్మతుల షాపు నిర్వహిస్తున్న ప్రకాశం జిల్లా బెస్తవారిపేటకు చెందిన వెంకటకృష్ణ(33), అంబర్‌పేటలో ఉంటున్న బెస్తవారిపేటకు చెందిన మేకల వెంకటేశ్వర్లు(30)కు విక్రయించేవాడు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు అమీర్‌పేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అవులయ్య, వెంకటకృష్ణ, వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2.13 లక్షల విలువైన 9 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, ఎస్ఐ రాజురాథోడ్ పాల్గొన్నారు.


శ్రీసంతోషిమాత మూల విరాట్


ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందినిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


అన్నానగర్‌లోని మైసమ్మ ఆలయంలో అన్నదానం చేస్తున్న బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

- మహా హారతి, మహా అన్నదానం
- భక్తులతో ఆలయాలు కిటకిట
- సంతోషిమాతను దర్శించుకున్న రాజకీయ ప్రముఖులు


వారాసిగూడలో వరలక్ష్మీదేవి పూజలో పాల్గొన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో గల జీరాలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి రంగురంగుల సుగంధభరిత పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. పెద్ద ఎత్తున అమ్మవారిని ఎంతో నిష్ఠగా దర్శించుకున్న భక్తులు తన్మయులయ్యారు. మహిళా భక్తులు ఒకరికొకరు పసుపు, బొట్లను, వాయినాలుగా ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహా హారతిలో వందలాది మంది భక్తులు పాల్గొనడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో దాదాపు 5వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, నమన శేషు కుమారిలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు వారిని దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ ఆలయ కమిటీ అధ్యక్షులు మనోజ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, సభ్యులు గణేష్, సంజయ్, అరుణ్, కృష్ణంరాజు, అనుపమ, విజయేందర్ రెడ్డి, శివ, రాజు, బాబు, జీవన్, అంజన్ యాదవ్, కుమార్ యాదవ్, హనుమంత్, భార్గవాచారి తదితరులు అన్ని ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు.

- కంటోన్మెంట్ అన్నానగర్‌లోని మైసమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ చైర్మన్ అశోక్ కుమార్, నర్సమ్మ, నారాయణ, శ్రీకాంత్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.


సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్‌లో నిర్వహించిన సీనియర్ ఆఫీసర్స్ స్టడీ పీరియడ్ (ఎస్ఓఎస్‌పీ)త్రివిధ దళాల అధికారులు

ముగిసిన సీనియర్ ఆఫీసర్స్ స్టడీ పీరియడ్

అల్వాల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 39వ సీనియర్ ఆఫీసర్స్ స్టడీ పీరియడ్ (ఎస్ఓఎస్‌పీ) శుక్రవారం సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్‌లో ముగిసింది. దీనికి ఎయిర్ కమోడోర్ స్థాయికి చెందిన 21 మంది త్రివిధ దళాల అధికారులు హాజరయ్యారు. జాతీయ భద్రతకు సంబంధించిన వివిధ అంశాలపై రూపొందించిన ఈ కోర్సులో భౌగోళిక, సైనిక ప్రాముఖ్యత కలిగిన వివిధ అంశాలపై అధికారులకు అధ్యక్షత వహించిన ఎయిర్ మార్షల్ పీకే వోహ్రా వివరించారు. దాంతోపాటు విభిన్న అంశాలపై అవగాహన కల్పించారు.

పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ ఎల్ఎన్ నగర్ ప్రాంతానికి చెందిన కేవీ నర్సింహమూర్తి(38)కి పది రోజుల క్రితం ఎంగేజ్‌మెంట్ జరిగింది. అయితే పెళ్లి చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో అతడు శుక్రవారం ఘట్‌కేసర్-చర్లపల్లి రైల్వే మార్గంలో ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కవితపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

- సైబర్‌క్రైం పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్సీ కవితపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అధికార కాంగ్రెస్‌కు చెందిన సోషల్ మీడియా విభాగాలతో పాటు ఆ పార్టీ నాయకుల సోషల్ మీడియా ఖాతాల్లో అసభ్యకర పోస్టింగ్‌లు చేస్తున్నారని అందులో పేర్కొన్నారు.


వినాయక మండప నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కమిటీ సభ్యులు

ముమ్మరంగా వినాయక మండపాల నిర్మాణం

- ఆకర్షణీయంగా రూపొందనున్న ఓల్డ్ బోయిగూడ మండపం

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితికి నగరం సిద్ధమవుతుంది. సికింద్రాబాద్ ప్రాంతంలో పోటాపోటీలుగా ఏర్పాటు చేసే వినాయక మండపాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. వినాయక నవరాత్రులు సమీపిస్తుండడంతో నిర్వాహకులు మండప నిర్మాణ పనుల్లో వేగాన్ని పెంచారు. అందుకు అనుగుణంగా రాష్ట్రపతి రోడ్డులో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో ఓల్డ్ బోయిగూడ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసే గణేశ్ మండపాన్ని ప్రతి సంవత్సరం మాదిరి ఎంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామని అసోసియేషన్ సభ్యులు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ యేడు ముంబయి నగరంలో ప్రత్యేకంగా తయారుచేయించిన గణనాధుడు దశావతారాలతో భక్తులకు దర్శనమివ్వనున్నారని, మండపంలో ఆ దేవదేవుడు శ్రీకృష్ణుడి చరిత్రను వివరించే ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటుచేస్తున్నట్లు, ప్రతి రోజు సాయంత్రం 7గంటల నుంచి ఈ ప్రదర్శన ఉంటుందని, ఇప్పటికే ఏర్పాట్లు రాత్రింబవళ్లు జోరుమీద సాగుతున్నాయని, గణనాధుడిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక క్యూ లైన్లతో పాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- ఎమ్మెల్యే పద్మారావుగౌడ్


మైలార్‌గడ్డలో సీసీ రోడ్డు నిర్మాణపనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వినాయకచవితి ఉత్సవాలు పురస్కరించుకుని అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయాలని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసన సభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మైలార్‌గడ్డ నుంచి నామాల గుండు వరకు 53లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారుల నుంచి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేశామన్నారు. వినాయకచవితి ఉత్సవాలు పురస్కరించుకుని రోడ్ల నిర్మాణం, మరమ్మతులను చేపట్టాలని, భక్తులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు జరపాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం సికింద్రాబాద్ ఎమ్మెల్యే కార్యాలయంలో జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళికాధికారి శ్రీనివాసరావు, మారేడుపల్లి తహసీల్దార్ భూపతిగౌడ్‌తో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సమావేశమయ్యారు. కొత్తభవనాల నిర్మాణాల అనుమతుల్లో పారదర్శకతను పాటించాలని, దళారీల ప్రమేయం లేకుండా ఏర్పాట్లు జరపాలని ఆయన కోరారు.


బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పేద, ధనిక తేడా లేకుండా అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, సకాలంలో మెరుగైన వైద్యం పొందాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయం వద్ద 28మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన 10.11లక్షల రూపాయల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి, టి.మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెట్టుగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు


సమావేశంలో శారదా మల్లేష్

చిలకలగూడ, ఆగస్ట్ 30 (ఆంధ్రజ్యోతి) : మెట్టుగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పార్థసారథి, బీజేపీ మహాకాళి జిల్లా అధికార ప్రతినిధి శారదా మల్లేష్ మాట్లాడుతూ పార్టీ ప్రతిష్టకి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకి వివరించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టి, సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జిల్లా సభ్యత్వ కన్వీనర్ శ్రీహరి, రాజేష్ నాయర్, మహేష్, గణేష్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ చేయాలి

- రాష్ట్రంలో రెడ్ల రాజ్యం
- జక్క సంజయ్ కుమార్


గాంధీ ఆస్పత్రిలో అమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్, బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్‌లను పరామర్శిస్తున్న మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

అడ్డగుట్ట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రెడ్డిల రాజ్యం అమలవుతున్నదని బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్క సంజయ్ కుమార్ అన్నారు. బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ గత ఏడు రోజులుగా గాంధీ ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ విభాగంలో జక్క సంజయ్ కుమార్‌తో పాటు బీసీ మహా సభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ గౌడ్‌లు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా జక్క సంజయ్ కుమార్ మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని తాము హైదరాబాద్ నగరంలో పలుచోట్ల నిరాహార దీక్ష చేస్తున్న తమ దీక్షను పోలీసులు భగ్నం చేశారని ఆయన ఆరోపించారు. ఊరంతా తిప్పి చివరికి గాంధీ ఆస్పత్రిలో పోలీసులు తమని చేర్పించారన్నారు. ఇక్కడ చికిత్స పొందుతూనే బీసీ డిక్లరేషన్ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. తెలంగాణలో రెడ్డిల రాజ్యం అమలు అవుతుందని ఎద్దేవ చేశారు. బీసీ డిక్లరేషన్‌తో పాటు స్థానిక ఎన్నికల్లో 42శాతం అమలు చేసేంత వరకు దీక్ష కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

- బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో అమరణ నిరాహర దీక్ష చేస్తున్న బీసీ నాయకులు బత్తుల సిద్దేశ్వర్, జక్కని సంజయ్‌లను మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గాంధీ ఆస్పత్రిలో పరామర్శించారు. వీరితో పాటు బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు బండారి పద్మ, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి తిప్పని నాగమణి, బీసీ రాజ్యాధికార సమితి యువజన ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, సాయి కుమార్, వెంటకరమణ, చామకూరి రాజు, గౌడ్‌లు మద్దతు పలికారు.


సీఈఓ పల్లవిని శాలువా కప్పి ఘనంగా సత్కరిస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌చారి

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆస్పత్రి సందర్శన

తిరుమలగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈఓ పల్లవి శుక్రవారం బొల్లారంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌చారి జాయింట్ సీఈఓ పల్లవిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ రామకృష్ణ ఉన్నారు.

కంటోన్మెంట్ స్థలాన్ని కాపాడండి

తిరుమలగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరిలోని నెహ్రూ సెంటినరీ కాలనీని ఆనుకొని ఉన్న కంటోన్మెంట్ స్థలాన్ని కొందరు వ్యక్తులు గణేష్ మండపం ముసుగులో కబ్జాకు యత్నిస్తున్నారని నెహ్రూ సెంటినరీ కాలనీవాసులు శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు సీఈఓకు వినతిపత్రాన్ని అందజేశారు. కొందరు వ్యక్తులు పర్మనెంట్‌గా పిల్లర్స్ వేయడానికి యత్నిస్తున్నారని, భూమి లెవల్ వరకు పిల్లర్లు వేశారని కాలనీవాసులు ఆ ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. కంటోన్మెంట్ బోర్డు అధికారులు స్థలాన్ని పరిరక్షించాలని వారంతా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివ, చరణ్, స్వప్న, శీల, విజయలక్ష్మి, రాటీ పాల్గొన్నారు.

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో.. ఉచిత వైద్యశిబిరం

బౌద్ధనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్‌లో చిలకలగూడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారం మార్కండేయ పార్కులో ఉచిత వైద్యశిబిరంను నిర్వహించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి ఫణి శిబిరంలో పాల్గొన్నవారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీచేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని, ప్రతి ఒక్కరూ శుక్రవారంను డ్రైడేగా పాటించాలని డాక్టర్ ఫణి తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌నగర్, ఫ్రైడే మార్కెట్, మార్కండేయనగర్, వేంకటేశ్వరనగర్ తదితర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించి దోమల వలన వ్యాప్తి చెందే రోగాలు, నివారణ మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాణి, శిరీష, ఆశావర్కర్లు రేఖ, రజిత, అనిత, మంజు, ఉష, వైశాలి, ఎంటమాలజీ అధికారి రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ అనుకూలంగా ఫ్యాషన్ ఉండాలి

- వై ఫ్లో సదస్సులో వక్తలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ పరంగా నూతనంగా ఏది సృష్టించినా అది పర్యావరణంపై ప్రభావం చూపుతుందని బెహ్నో న్యూయార్క్ ఫౌండర్ శివమ్ పుంజ్యా అన్నారు. తన దృష్టిలో సస్టెయినబల్ ఫ్యాషన్ అంటే నిజాయితీగా ఉండటమేనన్నారు. శుక్రవారం మాదాపూర్‌లో యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వై ఫ్లో) ఆధ్వర్యంలో సస్టెయినబల్ ఫ్యాషన్‌పై రౌండ్‌టేబుల్ చర్చ జరిగింది. వ్యాపారవేత్త పింకీరెడ్డి, ఫ్యాషన్ డిజైనర్ గౌరంగ్ షా, కాన్షియస్ ఎఫర్ట్ ఫౌండర్ సాచిబాల్ పాల్గొన్నారు. ప్రపంచమంతా ఇప్పుడు ఫ్యాషన్ వైపు చూస్తోందని గౌరాంగ్ షా అన్నారు. ఇక్కడ లభించినంత చేనేత వస్త్ర వైవిధ్యం మరెక్కడా లభించదని పేర్కొన్నారు. వై ఫ్లో ఛైర్‌పర్సన్ రిద్ధి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కేవలం ఒక శాతం వస్త్రాలు మాత్రమే రీ సైకిల్ చేస్తుండడం ఆందోళనకరమన్నారు.


చెక్కు అందజేస్తోన్న సొసైటీ అధ్యక్షులు చిలుకు స్వామి

ఎంబీఎఫ్ చెక్కు అందజేత

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యుడిగా ఉండి మృతి చెందిన జంగయ్య కుటుంబ సభ్యులకు మ్యూచువల్ బెనిఫిట్ ఫండ్ (ఎంబీఎఫ్) చెక్కును సొసైటీ అధ్యక్షులు చిలుకు స్వామి అందించారు. జనరల్, స్పెషల్ లోన్ మాఫీ చేస్తూ రూ.3,08,655/- చెక్కును జంగయ్య భార్య పద్మకు సికింద్రాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రవిశంకర్, డెలిగేట్ రాజేందర్, ఎంబీఎఫ్ సెక్షన్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీపతి శర్మకి వీడ్కోలు పలుకుతున్న ఉద్యోగులు

రైల్వేలో 76మంది ఉద్యోగ విరమణ

చిలకలగూడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 76 మంది శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడలో వీరు పనిచేశారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతు సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలు కోలాహలంగా మారాయి. రైల్ నిలయంలో అకౌంట్స్ విభాగంలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకి ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ వివేకానంద వారికి రావలసిన గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బకాయిలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయటానికి చర్యలు చేపట్టి వారికి వచ్చే పెన్షన్ పత్రాలు అందజేశారు. సీనియర్ సెక్షన్ ఆఫీసర్ వేదాంతం శ్రీపతి శర్మకి తోటి ఉద్యోగులు శాలువ, జ్ఞాపిక అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు.